## ఆకట్టుకున్న విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన



అయోధ్యలోని శ్రీరామ మందిరం నమూనా

జ్యోతినగర్, డిసెంబర్ 9: ఎన్టీపీసీలోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం జరిగిన సైన్స్, విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన ఆకట్టుకున్నది. ఎన్టీపీసీ మెయి ంటెనేన్స్ జీఎం అలోక్ చంద్ర ఠాగూర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ మోడల్స్, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఇతర సబ్జెక్టులలో విజ్ఞాన విషయాలను తెలుపుతూ 280 మోడల్స్‌కు పైగా ఎగ్జిబిట్లను విద్యార్థులు ప్రదర్శించారు. ఇందులో అయోధ్య శ్రీరామ మందిరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రదర్శనను తిలకించడానికి వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఎగ్జిబిట్లను తిలకించారు. ఇక్కడ ఎన్టీపీసీ ఏజీఎం హెచ్ఆర్ బిజోయ్‌కుమార్ సిక్దర్, పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞానచంద్, హెచ్ఎం ఆరం జ్యోతి, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పోచమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం



కాచాపూర్‌లో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, భక్తులు

జూలపల్లి, డిసెంబర్ 9: కాచాపూర్‌లో పోచమ్మ తల్లి ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితులు ఘనంగా హోమం నిర్వహించారు. పలువురు భక్తులు భూలక్ష్మీదేవి, శ్రీదేవి, బొడ్రాయి దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు తీసి దేవతామూర్తులకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బంటు ఎల్లయ్య, ఎంపీటీసీ మారుపాక శ్రీలత, ఉప సర్పంచ్ బండు మల్లారెడ్డి, మాజీ సర్పంచులు కందుకూరి అంజలి, ఆకుల రాజయ్య, ధూళికట్ట సింగిల్ విండో మాజీ చైర్మన్ గండు సంజీవ్, నాయకులు మారుపాక కుమార్, గాగిరెడ్డి దేవేందర్‌రెడ్డి, పెంట కనకయ్య పాల్గొన్నారు.

## దొంగతుర్తి జడ్పీ పాఠశాలకు ఆర్వో వితరణ




పాఠశాలలో బిగించిన మినరల్ వాటర్ ప్లాంట్

ధర్మారం, డిసెంబర్ 9: ధర్మారం మండలం దొంగతుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలకు ఓ స్వచ్ఛంద సంస్థ మినరల్ వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. కరీంనగర్ ఉమెన్ డెవెలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. దీంతో సుమారు ₹20 వేల విలువ చేసే 500 లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన మినరల్ వాటర్‌ను సదరు సంస్థ సమకూర్చారని పాఠశాల హెచ్ఎం అనురాధ తెలిపారు. శనివారం నుంచి ప్లాంట్ వినియోగంలోకి రాగా, స్వచ్ఛమైన తాగునీటిని విద్యార్థులకు అందించే ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. కాగా తమకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందించిన సంస్థకు పాఠశాల హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో ఉచిత ప్రయాణ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్



మంథని ఆర్టీసీ బస్ స్టాండ్‌లో ఉచిత ప్రయాణ బస్సును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# లాంఛనంగా మహాలక్ష్మి, చేయూత ప్రారంభం

- గోదావరిఖనిలో ప్రారంభించిన కలెక్టర్, సీపీ



గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో మహాలక్ష్మి, చేయూత పథకాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, రామగుండం సీపీ

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 9: మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, చేయూత పథకంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ లబ్ధి పరిమితి ₹10లక్షల వరకు పెంపు పథకాలను వినియోగించుకోవాలని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో నిర్వహించిన మహాలక్ష్మి, చేయూత పథకాల ప్రారంభోత్సవానికి రామగుండం పోలీసు కమిషనర్ రెమో రాజేశ్వరితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం రెండు కొత్త పథకాలను ప్రజల కోసం ప్రారంభించడం సంతోషకరమన్నారు. చేయూత పథకం కింద రాజీవ్ ఆరోగ్యశ్రీ గరిష్ఠ పరిమితిని ₹5లక్షల నుంచి ₹10లక్షలకు పెంచామన్నారు. ఈ పథకం కింద 1600 రకాల రోగాలకు 1300 ఎంప్యానల్‌మెంట్ ఉన్న దవాఖానల్లో చికిత్స అందిస్తామన్నారు. నేటి నుంచి ₹10లక్షల వరకు నగదు రహిత చికిత్స ప్రజలకు అందుబాటులోకి రానుందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీలోని పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. మహిళలు తమ ప్రభుత్వ గుర్తింపు కార్డును బస్సులో చూపించి ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. అనంతరం కలెక్టర్ మహాలక్ష్మి, చేయూత పథకాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఇక్కడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్‌కుమార్, రామగుండం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్, ఆర్టీసీ ప్రతినిధులు, ఆరోగ్యశ్రీ ప్రతినిధి సతీశ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

మంథని, డిసెంబర్ 9: మంథని ఆర్టీసీ బస్ స్టాండ్‌లో కాంగ్రెస్ శ్రేణులు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. బస్సులో మహిళలు, ఆడ పిల్లలతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు.

## మంథనిలో దత్త హోమం



మంథనిలో హోమం నిర్వహిస్తున్న వేద పండింతులు

మంథని, డిసెంబర్ 9: అవధూతదత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ, ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థ స్వామిజీ దివ్య ఆశీస్సులతో నవకోటి దత్తహోమంలోని అంతర్భాగముగా 7వ కోటిలోని మంథని దత్త గుడిలో శనివారం దత్త హోమం నిర్వహించారు. దత్త ఆలయ శతాబ్దిని పురస్కరించుకుని లోక కల్యాణార్థము శని, ఆదివారాలు రెండు రోజులపాటు దత్తహోమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు అవధానుల సీతారామశర్మ(నిఖిల్) తెలిపారు. ఈ హోమ దర్శనం, మంత్ర శ్రవణం శుభప్రదమని కావున భక్తులందరూ హోమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అవధానుల శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో విజయవాడ, హైదరాబాద్‌కు చెందిన వేద బ్రాహ్మణులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో దత్త గుడి పూజారి కొల్లారపు వెంకటరాజం, మహావాది ఆనంద్, చెన్నూరి ఆదిత్య, జక్కుల చంద్రశేఖర్, వేద బ్రాహ్మణులు, భక్తులు పాలొన్నారు.

## కలెక్టర్‌కు ఏఐటీయూసీ వినతి

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 9: గోదావరిఖని ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రాంతీయ దవాఖానలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ రామగుండం నగర కమిటీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ దవాఖానలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దవాఖానలో నాణ్యమైన వైద్యం అందడం లేదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో నిత్యం మరణాలు సంభవిస్తున్నాయని, విధుల నుంచి ప్రిన్సిపాల్‌ను తొలగించాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు నూతన జీవోలు అమలు చేసి ఐఈ, ఈఎస్ఐ కార్డులు ఇప్పించాలన్నారు. మందుల కొనుగోలుపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు.

# పూర్వం చదువుల్లో యుద్ధ విద్యకు ప్రాధాన్యం

- మనల్ని కాపాడుకోవడానికి కరాటే ఉపయోగపడుతుంది
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్, డిసెంబర్ 9: మన దేశంలో ప్రాచీన యుద్ధ విద్యలకు అధిక ప్రాధాన్యమిచ్చే వారని, పూర్వం నుంచి చదువుల్లో యుద్ధ విద్య ఒక భాగంగా ఉండేదని అల్ఫోర్స్ విద్య సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో శనివారం ఓకినోవా మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు కరాటే బెల్టు టెస్టులను నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడారు. కర్రసాము, కత్తిసాము, మల్లయుద్ధం, విలువిద్య లాంటి క్రీడలు మన యుద్ధ విద్యలని, కానీ కరాటేకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభించిందన్నారు. శత్రువులను ఎదురించడంలో కరాటేను మించింది లేదన్నారు. జపాన్ దేశంలో పుట్టిన కరాటే విద్య చైనా దేశంలో విస్తృతంగా విస్తరించిందన్నారు. ఈ యుద్ధ విద్యను మొదటగా సాధన చేసింది బౌద్ధ భిక్షవులన్నారు. అహింసను ఆచరించే ఈ భిక్షవులు బౌద్ధ ప్రచారం కోసం అడవుల్లో ప్రయాణించే సమయంలో దొంగలను ఎదురించడానికి ఈ యుద్ధకళను నేర్చుకున్నారని తెలిపారు. మనల్ని మనం కాపాడుకోవడానికి కరాటే ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఓకినోవా కరాటే గ్రాండ్ మాస్టర్ వసంత్‌కుమార్, ప్రిన్సిపాల్‌తో పాటు, అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కరాటే బెల్టులను అందజేస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

## బస్సు కిందపడి ఒకరికి గాయాలు

జ్యోతినగర్, డిసెంబర్ 9: ఎన్టీపీసీ రాజీవ్‌రహదారిపై శనివారం ఆర్టీసీ బస్సు కిందపడి గోదావరిఖని లెనిన్‌నగర్‌కు చెందిన అన్వేష్ తీవ్రంగా గాయపడ్డాడు. గోదావరిఖని వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక టైర్‌కింద పడ్డాడు. దీంతో కాలుమీదుగా బస్సు టైరు ఎక్కడంతో నుజ్జునుజ్జయింది. వెంటనే గమనించిన ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ బ్లూకోర్ట్స్ సిబ్బంది మల్లికార్జున్, శంకర్ ఆటోలో గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

## అనాథాశ్రమంలో అన్నదానం

ముత్తారం, డిసెంబర్ 9: మండలంలోని రామక్రిష్టాపూర్ గ్రామానికి చెందిన ఉప్పు సుజన్, సుప్రియ దంపతులు ఉద్యోగ రీత్యా అమెరికాలో ఉండగా వారి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని వెలిచాల గ్రామంలో స్పందన అనాథ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.